నమస్తే తెలంగాణ

# జనగామ

3 | వరంగల్, శుక్రవారం 6 డిసెంబర్ 2024 | JANAGAON




మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు.. వాటిని నెరవేర్చకపోవడమే గాక ఏడాది పాలనపై విజయోత్సవాలు జరుపడం ఆ పార్టీ ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారింది. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు అంటూ ఊదరగొట్టి రుణమాఫీ, పింఛన్, రేషన్‌కార్డు, ఆడబిడ్డలకు రూ.2,500, తులం బంగారం.. ఇలా ఏ ఒక్కటీ అమలుకాకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో 'విజయోత్సాహం' అటుంచి.. ప్రజలు హామీలపై నిలదీస్తారనే భయం కారణంగా మంత్రులు సహా ఎమ్మెల్యేలందరూ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఏడాది పాలన ఉత్సవాలను విజయవంతం చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందనే ఆందోళనే వారిని వెంటాడుతున్నది.

- వరంగల్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### రుణమాఫీకి కొర్రీలు పెట్టడం వల్లే..

అధికారంలోకి రాగానే రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తవుతున్నా రుణమాఫీ విషయంలో అయోమయం నెలకొన్నది. ఎవరికి మాఫీ అయ్యింది?, దాని ప్రాతిపాదిక ఏమిటో తెలియక రైతులు ఆగమవుతున్నారు. రుణమాఫీ ప్రక్రియ ముగిసిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంతో ఎక్కువ మంది రైతుల్లో ఆందోళన పెరిగింది. రుణాలు మాఫీ కాని వారే ఎక్కువ మంది ఉన్నారని ప్రతి ఊరిలోనూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాలుగు దశలుగా కొందరికే మాఫీ చేయడం సరికాదని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ విధానంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పెట్టి తమను ఆగం చేశారని రైతులు వాపోతున్నారు. ప్రతి రైతు పంట రుణాలను మాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక నిబంధనలు పెట్టి ఎక్కువ మందిని ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డు, కుటుంబం వంటి నిబంధనలు రైతులను ఇబ్బంది పెట్టేందుకేనని.. ఈ కారణాలతో లక్షల మంది రైతుల రుణాలను మాఫీ చేయకుండా ప్రభుత్వం ఎగవేసిందని చెబుతున్నారు.

# హామీల భయం.. విజయోత్సవాలకు దూరం..

- ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని ఆందోళన
- అతీగతీ లేని రుణమాఫీ, పింఛన్, రేషన్‌కార్డులు
- అధికారిక కార్యక్రమాలకు దూరంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

### కార్యక్రమాలకు హాజరుకాని అధికార పార్టీ ఎమ్మెల్యేలు

ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలలో అసంతృప్తి పెరుగుతున్నది. అరకొరగా రుణమాఫీ చేయడం, ఆసరా పింఛన్ల మొత్తం పెంచకపోవడం, కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడం, మహిళలకు ప్రతి నెల రూ.2,500, పేద ఆడబిడ్డ పెండ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం వంటి ముఖ్యమైన హామీలతో పాటు వేటినీ నెరవేర్చకపోవడంపై ప్రజలు రోడ్డెక్కి ప్రశ్నించేదాకా వచ్చింది. ఇదే సమయంలో ప్రభుత్వం ఆర్భాటంగా ఏడాది పాలన ఉత్సవాల కార్యక్రమం అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఇబ్బందికరంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 1 నుంచి వరుసగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందరు ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని మంత్రులతో పాటు అత్యధిక మంది ఎమ్మెల్యేలు ప్రజాపాలన ఏడాది ఉత్సవాల కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. కాంగ్రెస్ హామీలపై ప్రజలు నిలదీస్తారనే ఆందోళనతోనే ఎమ్మెల్యేలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. మంత్రి సురేఖ గురువారం ఒక్కరోజే నియోజకవర్గంలో కొన్ని కార్యక్రమాలకు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన కార్యక్రమాలు ఏమీ లేవు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమాండ్ల యశస్వినీరెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వ ఏడాది ఉత్సవాల కార్యక్రమాలకు పూర్తిగా దూరం ఉంటున్నారు.

ఇక డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రూనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే కార్యక్రమాలకు పరిమితమవుతున్నారు. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలెవరూ పర్యటించడం లేదు.



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

# పోరాటం మాకు కొత్త కాదు..

- ప్రజల కోసం ఎంత వరకైనా వెళ్తాం..
- అక్రమ కేసులకు భయపడేది లేదు..
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలంటే చులకనభావం
- ఏడాదైనా ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు..
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలపై అక్రమ కేసులు పెట్టి, అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి పోరాటం కొత్త కాదని, ప్రజల కోసం ఎంతవరకైనా వెళ్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన భయపడేది లేదన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా విజయోత్సవాలు చేయడం సిగ్గుచేటన్నారు. నిజంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తే కాంగ్రెస్ నాయకులు కాదు.. తెలంగాణ ప్రజలే సంబురాలు చేసుకునే వాళ్లు కదా? అని ప్రశ్నించారు. ఒకవైపు విజయోత్సవాలకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తూనే, మరోవైపు అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హరీశ్‌రావు ఫోన్‌ట్యాపింగ్ చేశాడని ఒక రౌడీషీటర్ ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం ఎఫ్‌ఐఆర్ ఎలా నమోదు చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పుడు, మీ ప్రభుత్వ హయాంలోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని పోలీసులకు సమాచారం ఇవ్వడానికి వెళ్తే అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యేలపై కేసులు పెడితే ఎఫ్‌ఐఆర్‌లు ఎందుకు లేవని ప్రశ్నించారు. సీఎం కోసం నిర్మించిన ఇంట్లో ఉండకుండా తన సొంత ఇంటిని ఇనుపకంచెలతో నిర్మించుకున్న రేవంత్‌రెడ్డికి ప్రజలన్నా, రాష్ట్రమన్నా చులకనభావమని, గౌరవం లేదని విమర్శించారు. సంవత్సర కాలంలో చేసిన పనులేవని నిలదీస్తే తమపై దాడులు చేయడం సరికాదన్నారు. లగచర్లలో దళిత, గిరిజన రైతులపై దాడులు చేసి, భూములు గుంజుకోవాలని చూస్తే అధికారులు, పోలీసులను ఎలా నిర్బంధించారో, రానున్న రోజుల్లో మీరిచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజలు మిమ్మల్ని వాడవాడలా నిర్బంధించడం ఖాయమన్నారు. తెలంగాణ పవిత్రతను కొల్లగొడుతూ, రాష్ట్ర ప్రగతిని నాశనం చేస్తూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతిలో రాష్ట్రాన్ని పెట్టడానికి రైఫిల్‌రెడ్డి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. రైఫిల్‌రెడ్డి 420 హామీలు అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. రూ.40వేల కోట్ల రుణమాఫీకి రూ. 12 వేల కోట్లు మాత్రమే చేసి, చేతులు దులుపుకున్న రేవంత్‌రెడ్డి ఏ గ్రామానికైనా పోయి, రైతులతో మాట్లాడే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీసరిగ్గా అమలు చేయడం లేదని ఆరోపించారు. ఉచిత బస్సు పెట్టి బస్సుల సంఖ్య కుదించావు.. సిలిండర్ సబ్సిడీ ఇవ్వడం లేదు.. వడ్లకు బోనస్ అని బోగస్ మాటలు చెప్పావు.. రైతులకు రుణమాఫీ చేయక, రైతుబంధు, బోనస్ ఇవ్వకుండా మోసం చేసిన నీకు త్వరలోనే తెలంగాణ ప్రజలు ఘోరికట్టడం ఖాయమన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలపై కుట్రలు ఆపకుంటే రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలతో కలిసి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఎడ్ల వేణు, బానోత్ రవికుమార్, జెరిపోతుల వెంకన్న, మంగళంపల్లి కన్నా, తేళ్ల శీను, రామకృష్ణ, అర్జున్‌ప్రసాద్ పాల్గొన్నారు.



మర్రిపెల్లిగూడెంలో వీరభద్ర రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

# పరిమితికి మించి ధాన్యం ఎందుకు దించుకున్నరు?

- ఆర్వోలు లేకుండా రైతులకు డబ్బు లిచ్చేదెట్లా..
- రైస్ మిల్లర్‌పై కలెక్టర్ ప్రావీణ్య ఆగ్రహం
- వీరభద్ర రైస్ మిల్లు తనిఖీ.. ధాన్యం నిల్వలపై ఆరా

నమస్తే ఎఫెక్ట్

కమలాపూర్, డిసెంబర్ 5 : ఆర్వోలు లేకుండానే పరిమితికి మించి రైతుల ధాన్యాన్ని ఎలా దించుకున్నారంటూ హనుమకొండ కలెక్టర్ పీ ప్రావీణ్య రైస్ మిల్లు యజమానిని ప్రశ్నించారు. ఇలాగైతే వారికి డబ్బులెట్లా ఇచ్చేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కమలాపూర్ మండలం మర్రిపెల్లిగూడెం సమీపంలోని వీరభద్ర రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. రైస్‌మిల్ యజమాని ఆర్వో లేకుండానే కెపాసిటీకి మించి ధాన్యం దిగుమతి చేసుకోవడంతో మండలంలో సుమారు 600 మంది రైతులకు చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం 'అధికారుల తప్పిదమా? రైస్‌మిల్లర్ కక్కుర్తా?' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. నేరుగా రైస్ మిల్లుకు వచ్చిన ఆమె ధాన్యం నిల్వలపై ఆరా తీసి మిల్లింగ్‌ను పరిశీలించారు. కాగా, ఈ విషయమై ఇప్పటికే ఆరా తీసిన ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు తెలిసింది. అంతకుముందు కలెక్టర్ కమలాపూర్ సీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా వైద్యాధికారి అప్పయ్య, డీఆర్డీవో శ్రీనివాస్, డీసీవో కొండయ్య, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీవో బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తూర్పులో యూత్ కాంగ్రెస్ చిచ్చు..

- ఎమ్మెల్సీ సారయ్య అనుచరుడి గెలుపుతో కొండా మురళి, సారయ్య మధ్య భగ్గుమన్న వర్గపోరు
- అగ్గిరాజేసిన ఎన్నికల ఫలితాల వాట్సాప్ పోస్ట్
- రెచ్చిపోయి సారయ్య అనుచరుడిపై ఇన్‌స్పెక్టర్ దాష్టీకం



సుబేదారి, డిసెంబర్ 5 : యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు వరంగల్ తూర్పులో చిచ్చురేపాయి. ఇంతకాలం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మధ్య అంతర్గతంగా ఉన్న వర్గపోరు ఒక్కసారిగా బహిర్గతమైంది. యూత్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో సారయ్య వర్గీయుడు గెలువడం కొండా దంపతులకు షాక్ తగలడంతో పాటు ఆనందోత్సాహాలపై వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన పోస్టుతో కొండా అనుచరులు రెచ్చిపోవడం, దీనికి అధికారం అండతో ఓ ఇన్‌స్పెక్టర్ సదరు యువకుడిపై ప్రతాపం చూపడం చర్చనీయాంశమైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో ఎమ్మెల్సీ సారయ్య అనుచరుడు గెలుపొందడంతో సారయ్య వర్గానికి చెందిన వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన యూత్ కాంగ్రెస్ కార్యకర్త వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ పెట్టాడు. ఇది చూసిన లేబర్‌కాలనీకి చెందిన కొండా వర్గానికి చెందిన నలుగురు కార్యకర్తలు సదరు యువకుడిని బెదిరించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో అతడికి ఫోన్ చేసి 'దమ్ముంటే చూసుకుందాం రా.. శివనగర్‌కి రా.. ఇక్కడే ఉన్నాం' అనడంతో అతడు వెంటనే ఇంటినుంచి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో తెలంగాణ జంక్షన్‌లో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. పోలీసులు ఇరువురిని రాత్రి ఒంటి గంట సమయంలో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కొద్దిసేపటికి స్టేషన్‌కు వచ్చిన ఇన్‌స్పెక్టర్.. కొండా అనుచరులను పంపించి, సారయ్య అనుచరుడిని మాత్రం స్టేషన్‌పైకి తీసుకెళ్లి చితకబాదినట్లు తెలిసింది. సదరు యువకుడు తనకు రెండు రోజుల్లో పెళ్లి ఉందని చెప్పినా కనికరం లేకుండా 'వాట్సాప్ పోస్ట్ ఎందుకు పెట్టావురా' అని సదరు ఇన్‌స్పెక్టర్ ప్రశ్నిస్తూ కొట్టి, తెల్లవారుజామున 3గంటలకు వదిలిపెట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో తూర్పులో కొండా, సారయ్య వర్గాల్లో ఒక్కసారిగా విభేదాలు భగ్గుమన్నాయి.

**అక్కడ అంతే.. తీరు మారదంతే..!**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు అధికారులు హద్దు మీరి ప్రవర్తిస్తున్నట్లు తాజా సంఘటన స్పష్టంచేస్తోంది. ఇటీవలే మంత్రి అనుచరుడి ఆదేశాల మేరకు పలువురిని స్టేషన్‌లో బంధించి కొట్టిన సంఘటనలు ఉండగా, సెటిల్‌మెంట్లకు కొందరు పోలీసులు సపోర్ట్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో ఇటీవల తూర్పులో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై బదిలీ వేటు కూడా పడింది. అయినా కూడా ఆ ఏరియా పోలీసుల్లో మార్పు రావడం లేదు. మంత్రి ప్రధాన అనుచరుడి ఆదేశాల మేరకే పనిచేస్తారనేది తాజాగా సారయ్య వర్గం యువకుడికి ఇచ్చిన పోలీస్ ట్రీట్‌మెంట్ తీరును బట్టి మరోసారి తెలుస్తోంది. అక్కడ లా అండ్ ఆర్డర్ అదుపు తప్పి, మాజీ రౌడీషీటర్ గుప్పిట్లో పోలీసింగ్ నడుస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## కోడెలు పెంచుతానని తెచ్చి అమ్ముకున్నడు..

**కేసు నమోదు, పోలీసుల విచారణ**

గీసుగొండ, డిసెంబర్ 5 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి కొద్దిరోజుల క్రితం స్వామి వారి కోడెలను తన గోశాలలో పెంచుతానని తీసుకొచ్చి వాటిని విక్రయించిన కేసులో గీసుగొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన మాదాసి రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. విశ్వహిందూ పరిషత్ వరంగల్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి అతడు ఆలయం నుంచి తెచ్చిన 60 కోడెల్లో 11మాత్రమే అతని వద్ద ఉన్నాయని మిగిలిన 49 లేకపోవడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై వేములవాడ ఆలయ దేవాదాయ శాఖ అధికారులకు వివరణ కోరుతూ లేఖ రాసినట్లు ఆయన తెలిపారు.



## ఏకంగా ఐదు కొలువులు

### సర్కారు ఉద్యోగాలతో సత్తాచాటిన సత్యనారాయణ



సత్యనారాయణ

గణపురం, డిసెంబర్ 5 : కష్టపడితే ఏదీ అసాధ్యం కాదు అని నిరూపించాడు ఆ యువకుడు. సర్కారు కొలువే లక్ష్యంగా పెట్టుకున్న అతడిని ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదు ఉద్యోగాలు వరించాయి. ములుగు పట్టణానికి చెందిన వీణవంక సత్యనారాయణ ప్రతి రాత పరీక్షలోనూ సత్తాచాటి ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలిచాడు. సత్యనారాయణ జంగేడులో 1997లో పదో తరగతి చదివాడు. ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేసి స్వర్ణకార కులవృత్తిని చేస్తూ 15 ఏళ్ల తర్వాత చదువుకోవాలనే ఆశయంతో 2012లో దూరవిద్య ద్వారా డిగ్రీ, బీఈడీ చేశాడు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాడు. అతడి కష్టానికి ఫలితంగా ఐదు ఉద్యోగాలు వెతుక్కుంటూ వచ్చాయి. సత్యనారాయణ టీజీటీ, లాంగ్వేజ్ పండిట్, స్కూల్ అసిస్టెంట్, రెసిడెన్షియల్ లెక్చరర్ ఉద్యోగాలను సాధించాడు. బుధవారం విడుదలైన టీజీపీఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా గెజిటెడ్ ఉద్యోగం సాధించి తన ప్రతిభ చాటారు. ఇప్పటికే గణపురం జడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ప్రతి పరీక్షను సవాలుగా తీసుకొని చదివిన ఆయన సబ్జెక్టుపై పట్టు సాధించారు. ఐదు ఉద్యోగాలు సాధించడంతో సహచర ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందిస్తున్నారు. భవిష్యత్‌లో డిగ్రీ లెక్చరర్‌గా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగాలు సాధించడమే తన లక్ష్యమని చెబుతున్నారు.

# కాలగర్భంలో కాకతీయుల ఆనవాళ్లు

- శిథిలావస్థలో అశోక్‌నగర్‌లోని శివాలయం
- మాయమైన మట్టి కోట
- పట్టించుకోని ప్రభుత్వాలు, పురావస్తు శాఖ
- పునరుద్ధరించాలంటున్న గ్రామస్తులు



శిథిలావస్థకు చేరుకున్న శివాలయం



ఖానాపురం, డిసెంబర్ 5 : వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ శివారులో కాకతీయుల చారిత్రక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే మట్టి కోట మాయం కాగా శివాలయం శిథిలావస్థకు చేరింది. పాలకులు, అధికారుల పట్టింపులేమితో భవిష్యత్‌తరాలకు వారసత్వంగా అందించాల్సిన కట్టడాలు కాలగర్భంలో కలిసిపోనున్నాయి. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు 1213లో దట్టమైన అడవుల మధ్యన పాకాల సరస్సును నిర్మించారు. కాకతీయ రాజులు అడవి జంతువుల వేటను అమితంగా ఇష్టపడేవారు. దీంతో వారు తరచూ పాకాల అడవులకు వచ్చేవారు. ఈ క్రమంలో ఇక్కడ విడిది చేసేందుకు ప్రస్తుతం సైనిక్ స్కూల్ ఉన్న ప్రదేశంలో కోటను నిర్మించుకున్నారు. దీని చుట్టూ నాలుగు మూలల్లో కాపలాదారులు ఉండేలా ఎత్తైన గోడ నిర్మించారు. దీనిపైనే సైనికులు గుర్రాలపై తిరుగుతూ రాజులకు రక్షణ కల్పించేవారు. ప్రస్తుతం ఈ కోట గోడ శిథిలావస్థకు చేరింది. అలాగే అదే ప్రాంతంలో అశ్వశాలను నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అలాగే అదే ప్రాంతంలో 30 ఎకరాల విస్తీర్ణంలో శత్రుదుర్భేద్యంగా మట్టి కోటను సైతం నిర్మించారు. యుద్ధాలు వచ్చినప్పుడు కాకతీయ రాజులు ఎక్కువగా ఇక్కడే ఉండి వ్యూహాలు పన్నేవారట. వేటకు వెళ్లే ముందు తమ ఇష్ట దైవమైన శివుడిని పూజించేవారు. అందుకోసమే మట్టి కోట మధ్య భాగంలో రాతి శిలలతో శివాలయాన్ని కట్టించారు. వారి కాలంలో శివాలయం దేదీప్యమానంగా వెలుగొందగా ఆలయం నుంచి వరంగల్ కోట వరకు సొరంగ మార్గం ఉండేదని ప్రచారంలో ఉంది. యుద్ధాలు, అత్యవసర సమయాల్లో కాకతీయ రాజులు ఈ మార్గాన్ని ఉపయోగించుకునేవారట.

**కోటకు బీటలు.. శివాలయం ధ్వంసం**

కాకతీయ రాజులు నిర్మించిన మట్టి కోట, శివాలయం కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. మట్టి కోట బీటలు వారి భూమిలో కలిసిపోతుండగా, శివాలయం పూర్తిగా ధ్వంసమైంది. గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపడంతో ఆలయం దెబ్బతిని శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం పిచ్చిమొక్కలు పెరిగి శివాలయం ఆనవాళ్లు కోల్పోయింది. ఇంతటి చారిత్రక నేపథ్యమున్న శివాలయాన్ని పురావస్తు శాఖ అధికారులు పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అక్రమ అరెస్టులపై భగ్గుమన్న బీఆర్‌ఎస్



కమలాపూర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ధర్నా
- కేయూ మొదటి గేట్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కమలాపూర్/నయీంనగర్, డిసెంబర్ 5 : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని పరకాల, హుజూరాబాద్ నాలుగు లేన్ల రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తక్కళ్లపల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ.. తన ఫోన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్యాపింగ్ చేస్తున్నాడని కౌశిక్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేస్తే, తప్పుడు కేసు నమోదు చేసి అరెస్ట్ చేయించినట్లు చెప్పారు. అక్రమ కేసులు పెట్టి ప్రశ్నించే గొంతులను నొక్కలేరని, అరెస్ట్ చేసిన ఎమ్మెల్యేను వెంటనే విడుదల చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు బీఆర్‌ఎస్ నేతలను యత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లడె గోపాల్, మాట్ల వెంకటేశ్వర్లు, శనిగరపు సమ్మయ్య, శ్రీనివాస్, రాజు, బాబు, రాజయ్య తదితరులున్నారు. అలా గే, అక్రమ అరెస్టులకు నిరసనగా హనుమకొండలోని కేయూ మొదటి గేట్ వద్ద బీఆర్‌ఎస్వీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి తన అధికారబలంతో పోలీసులను అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్టు చేయించడం సరైంది కాదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సీనియర్ నాయకులు కొమురయ్య, కేయూ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, అరూరి రంజిత్, సుమన్ అన్నారు. రానున్న రోజుల్లో ప్రతికార చర్యలకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలని, లేని పక్షంలో ప్రజా తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు.



కేయూ మొదటి గేట్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు